# పుణ్యానికి కొత్త మార్గాలు

- కళ్యాణి

ఈమధ్యనే నా స్నేహితురాలు లక్ష్మి బలవంతంతో, రెండురోజులు గడిపి వద్దామని వాళ్ళ ఇంటికి వెళ్ళాను. "మా అబ్బాయి శిరీష్ ప్రొద్దున్నే శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం చదువుకునిగాని పనికి వెళ్ళడు" అని కొడుకు దైవ భక్తి గురించి చెప్పింది నా స్నేహితురాలు. మర్నాడు శిరీష్ ప్రొద్దుటే 6:00 గంటల కే లేచి కంప్యూటర్ లో log-in చెయ్యడంతోనే M.S. సుబ్బలక్ష్మి 'శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం' మొదలుపెట్టారు. కంప్యూటర్స్ లేని రోజులలో పుస్తకంలో సుప్రభాతం చదవడం అలవాటయిన నాకు ఈపద్ధతి బాగానే ఉందనిపించింది. కాసెట్స్, CDలు వున్నా, కంప్యూటర్ సుఖం, వాడుతున్న వాళ్ళకే తెలుస్తుందంటారు శిరీష్ లాంటి యువకులు. ఇంతలో శిరీష్ ఎడమ చేతితో కాఫీ కప్‌తో కంప్యూటర్ ముందు కూర్చుని, కుడి చేతివేళ్ళతో e-mail check చేస్తూండగా, cellphone మ్రోగింది. జోకులేసుకుంటూ స్నేహితుడితో (రాలితోనో) మాట్లాడడం చూశాను. ఈలోగా సుబ్బలక్ష్మి సుప్రభాతం, ప్రపత్తి, మంగళం కూడా పాడటం అయిపోయాయి. మరి పుణ్యం ఎంతవచ్చిందో కానీ శిరీష్ కి ఈ రోజు, కాఫీ, e-mails, phone calls మాత్రం నిర్విఘ్నంగా మొదలయ్యాయి. ఇంక నాలో కొత్త లోచనలు రావడం మొదలయ్యాయి. అదే కాక మరి కొన్ని సంఘటనలు కూడా గుర్తుకొచ్చాయి.

********

సుమారు పది సంవత్సరాల క్రితం అనుకుంటా "వినాయకచవితి" ముందురోజు మా మేనమామగారి అబ్బాయి పంపిన e-mail గుర్తుకొచ్చింది. అందులో వింత...

"Happy Vinayaka Chaviti" అని రాసివుంది. వెంటనే రంగురంగుల గణపతి బొమ్మ, మంత్రాలు, ధూపం అనగానే అగరవత్తులు, దీపం అనగానే దీపాలు వెలగడం, గంట మ్రోగడం, ఉండ్రాళ్ళు, పువ్వులు, పళ్ళు screen చివరినుంచి కదలి గణపతి ముందుకి ప్రత్యక్షమవ్వడంతో నాకు ఆశ్చర్యం వేసింది. మాఇంటిల్లిపాదిని పిలిచి ఈ వింత మళ్ళీ మళ్ళీ చూశాం. వెంటనే మాశ్రీవారు, "హమ్మయ్యా! ఇన్నాళ్ళికి ఎవరికో ఇంత brilliant idea వచ్చిందని, ఇంక computers ధర్మమా అని ప్రతి ఇంట ఈ విధంగా వినాయక చవితి జరుపుకుంటారు" అనినవ్వారు. మరి ఈ computer భక్తులకి గణపతి ఎంత పుణ్యమిస్తాడో! అని లోచించాను. నాకుమాత్రం, చిన్నప్పుడు పూజకి ప్రొద్దుటే లేచి గణపతిని అలంకరించడం, పాలవెల్లి కట్టడం, అమ్మ ఉండ్రాళ్ళు, పిండివంటలు చెయ్యడం, మా నాన్నగారు మాఅందరిచేత పూజ జరిపించి, కథ చెప్పడం అక్షింతలు మా తలల మీద వేసి దీవించడం తరువాత అందరం కలసి భోజనం చేయడం ఇవన్నీ ఒక్కసారిగా గుర్తుకొచ్చేశాయి.

********

పోయినవారం 52 మందితో పాటు నాకూ అదే e-mail వచ్చిన సంఘటన. e-mail తీరా చదవబోతే, ముందుగా దేముడి పటం, వెనువెంటనే దేముడి పద్యాలే కాకుండా, చివర వాక్యాలలో, ఇవన్నీ చదివి మరో పదిమందికి ఆలస్యము చేయకుండా వెంటనే e-mail పంపవలెనని ఉంది. పంపినవారికి 3-5 రోజులలో ధనలాభం తప్పదు అని కూడా వుంది. అంటే నేను చెయ్యవలసినదల్లా అదే e-mail మరో 10మందికి "forward" చేస్తేచాలు మూడో రోజుకల్లా, భగవంతుడు సంతోషించి, నాకు పుణ్యం ధనరూపంలో ఇస్తాడన్నమాట.

కానీ నా పుణ్యం అప్పటికే నాకు తెలిసి 62 మందితో పంచుకుంటున్నానన్న ఆలోచన రాక పోలేదు. అయినా నిజంగా - ఆలోచిస్తే అప్పటికే e-mail భక్తులు ప్రపంచంలో ఉన్న కంప్యూటర్ల ద్వారా లెఖ్ఖచూస్తే ఎంతమంది వున్నారో! ఈనాడు ఇల్లాంటి e-mails ఎన్ని వస్తునాయంటే, కంప్యూటర్ లో e-mail 10 మందికి cc కొట్టడంతో అదృష్టం, పుణ్యం సంగతి ఎలావున్నా, అసలు ఏ దేముడిని ప్రార్థిస్తున్నామో "sent mail"లో చూస్తేకానీ తెలియదేమో! పుణ్యాన్ని పంచే భగవంతుడుకూడా కంప్యూటర్ భాష నేర్చుకోవాలేమో!

చిన్నప్పటి సంఘటన మరొక్కటి. ఒకరోజు పోస్టులో నాపేరుతో ఒక కార్డ్ వచ్చింది. ఎవరు పంపారో మాత్రం దాని మీద రాయలేదు. ఎంతో ఆత్రంగా చదివాను. అందులో వున్నదేమంటే ఇది భగవంతుని సందేశం. "-----------------" ఈ సందేశాన్ని అందుకుని, చదువుకుని, తరువాత 48 గంటలలో 10 మందికి, 10 పోస్టుకార్డ్స్ లో ఉన్నదున్నట్టుగా కాపీ చేసి పోస్టు చెయ్యాలి. తరువాత 3 రోజులకి ధనలాభం, పంపకపోతే ధన నష్టం, ఆపద రావచ్చని వుంది. ధనలాభం రాకపోయినా, ఆపద, నష్టానికి భయపడి వెంటనే 10 కార్డ్సు పంపించేశాను. నాకు గుర్తున్నంతవరకు 3 రోజుల తరువాత లాభమూ, నష్టమూ కూడా రాలేదు. కానీ భగవంతుని సందేశం 10 కార్డ్స్‌లో 10 మాట్లు అనుకుంటూ చేతితో రాసినందుకు అదృష్టం వచ్చిందనే నా నమ్మకం.

అల్లాగే ఈ రోజు e-mail చూడగానే నా చిన్నప్పుడు వేసవి శలవలలో (బడి లేనప్పుడు) అమ్మమ్మ అన్న మాటలు గుర్తుకొచ్చాయి. పిచ్చాపాటీ కబుర్లతో గంటలు, రోజులు గడిపేకంటే "రామకోటి" రాయకోడదా, పుణ్యం వస్తుందనేది. అంటే, "శ్రీరామ, శ్రీరామ..." అని కోటిసార్లు చేతితో రాయడమన్నమాట. వూరికే రాస్తూ పోవడం కాదు, అమ్మమ్మ చెప్పినదేమంటే, "శ్రీరామ" అని రాసినప్పుడల్లా నోటితో రామనామం చెప్పుకోవాలిట. దానివలన, చెడు ఆలోచనలు రావు సరికదా, పుణ్యం వస్తుందని అమ్మమ్మ నమ్మకం, అదే పాటించేది కూడా. ఇదే మాట ఈమధ్య మా 7 ఏళ్ళ మనుమరాలితో అంటే, దాని సమాధానం, "అమ్మమ్మా! ఒక్కసారి కంప్యూటర్ లో "శ్రీరామ" అని టైప్ చేసి, పేజీ అంతా "copy" అని క్లిక్ చేస్తే సరిపోతుంది కదా!" అని సలహా ఇచ్చింది. అప్పుడు నేను తెలివిగా నీకు ఒకసారి "శ్రీరామ" అనుకుంటూ టైప్ చేశావు కాబట్టి ఒక "శ్రీరామ" పుణ్యమే వస్తుందన్నాను. మరి మీరేమంటారు?